సంక్షేమంలో సరికొత్త ఒరవడి

• ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్ కుమార్ రెడ్డి



పట్టణంలోని 16వ వార్డులో గడపగడపకు మనప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్ కుమార్ రెడ్డి

కావలి: రాష్ట్రంలో సంక్షేమ పథకాలతో సరికొత్త ఒరవడి సృష్టించిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డికే దక్కుతుందని కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని 16 వార్డులో గడపగడపకు మనప్రభుత్వం కార్యక్రమాన్ని ఎమ్మెల్యే శుక్రవారం నిర్వహించారు. ఇంటింటికి తిరిగి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను, అభివృద్ధి కార్యక్రమాలను వివరించి బుక్‌లెట్‌లు పంపిణీ చేశారు. అనంతరం మాట్లాడుతూ రాష్ట్రంలోని ప్రతి పేద కుటుంబానికి ఉపయోగపడేలా ప్రభుత్వం సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నట్లు తెలిపారు. దేశంలో ఎక్కడా లేని విధంగా సచివాలయాలు, వలంటీర్ల ద్వారా ప్రభుత్వ పాలనను నేరుగా పేదల ఇంటి ముంగిటకే తీసుకురావడంతో పాటు సంక్షేమ పథకాల అమల్లో నూతన శకానికి నాంది పలికినట్లు తెలిపారు. లక్షలాది మందికి నివేశన స్థలాలతో పాటు పక్కా ఇళ్లు, పింఛన్లు, మహిళలకు రుణాలు, రైతులకు రైతుభరోసా, విద్యార్థులకు జగనన్న విద్యదీవెన, వసతి దీవెనతో పాటు భారీగా సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నట్లు తెలిపారు. ప్రాథమిక దశ నుంచే ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలనే సంకల్పంతో నాడు–నేడు ద్వారా పాఠశాలలను కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా తీర్చి అత్యున్నత బోధన అందిస్తున్నట్లు వివరించారు. పేద పిల్లలు ఇంగ్లిష్ మీడియంలో, ట్యాబ్‌లతో అత్యున్నత బోధన అందుకోవడం జీర్ణించుకోలేని పచ్చపత్రికలు, టీడీపీ ఇంగ్లిష్ మీడియం అడ్డుకోవాలని చూడడం, ట్యాబ్‌లపై దుష్ప్రచారం చేయడం ప్రజలందరికీ తెలిసిందేనన్నారు. పచ్చపత్రిలు, ప్రతిపక్షాలు ఎన్ని విమర్శలు చేసినా, అసత్యాలు అల్లినా ప్రజలు పట్టించుకునే స్థితిలో లేరని స్పష్టం చేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు పేరం వెంకటేశ్వర్లు, పేరం నాగరాజు, పందిటి కామరాజు, కుందుర్తి కామయ్య, కునుపర్తి రాజశేఖర్, నాగేశ్వరమ్మ, తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ కార్యకర్తలు వైఎస్సార్‌సీపీలో చేరిక



ఎమ్మెల్యే ప్రతాప్ కుమార్ రెడ్డి సమక్షంలో పార్టీలో చేరుతున్న టీడీపీ కార్యకర్తలు

కావలి: పట్టణంలోని 16వ వార్డులో శుక్రవారం నిర్వహించిన గడపగడపకు మనప్రభుత్వం కార్యక్రమంలో స్థానిక టీడీపీ ప్రచార కార్యకర్త కాలేషా వైఎస్సార్‌సీపీ తీర్థం పుచ్చుకున్నారు. ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి సమక్షంలో పార్టీ కండువా కప్పుకున్నారు. కాలేషా మాట్లాడుతూ 30 ఏళ్ల నుంచి టీడీపీ కార్యకర్తగా ఉన్నా.. నా పరిధిలో ఎవరికి ఏ విధంగా న్యాయం చేయలేకపోయానని తెలిపారు. ప్రభుత్వం అమలు సంక్షేమ పథకాలతో ప్రజలు ఆర్థికంగా నిలదొక్కుకుంటున్నారన్నారు. ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్ కుమార్‌రెడ్డి చేస్తున్న మంచి పనులు చూసి టీడీపీని వీడి వైఎస్సార్‌సీపీలో చేరినట్లు తెలిపారు. 16వ వార్డుకు చెందిన మరో టీడీడీ కార్యకర్త జంగాల తిరుపతి, మరి కొంతమంది టీడీపీ మహిళా కార్యకర్తలు కూడా పార్టీలో చేరారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

కావలి కాలువ ఈఈతో రైతులకు కష్టాలు

• అవగాహనా లోపంతో అన్నదాతలకు అవస్థలు



బిట్రగుంట: మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ మద్దిబోయిన వీరరఘు

బిట్రగుంట: కావలి కాలువ ఈఈ అవగాహనా లోపం, నిర్లక్ష్య వైఖరి కారణంగా ఆయకట్టు రైతులు తీవ్ర అవస్థలు పడుతున్నారని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు మద్దిబోయిన వీరరఘు అన్నారు. కలెక్టర్ వెంటనే స్పందించి కావలి కాలువ ఈఈ స్థానంలో సమర్థవంతమైన అధికారిని వెంటనే నియమించాలని డిమాండ్ చేశారు. బోగోలులోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో శుక్రవారం రఘు రైతులతో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కావలి కాలువ ఆయకట్టు కింద నార్లు వేసుకోవద్దంటూ ఈఈ సూచించడంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈఈ వ్యాఖ్యలు అవగాహనా లోపానికి, నిర్లక్ష్యానికి నిదర్శనంగా కనిపిస్తున్నాయని విమర్శించారు. ఇటీవల కురిసిన వర్షాలకు జిల్లాలోని సోమశిల జలాశయంతో పాటు సంగం బ్యారేజీ, కనిగిరి రిజర్వాయర్‌తో పాటు జిల్లాలోని చెరువులన్నీ జలకళ సంతరించుకున్నాయని తెలిపారు. జలాశయాలతో పాటు చెరువుల్లో నీరున్నా నాట్లు వేసుకోవద్దంటూ ఈఈ సూచించడం విడ్డూరంగా ఉందన్నారు. అసలు కావలి కాలువ కింద ఎన్ని చెరువులు ఉన్నాయి, ఆ చెరువుల్లో ప్రస్తుతం ఎంత మేర నీరు ఉంది, చెరువులు నింపాలంటే ఇంకా ఎంత మేర నీరు విడుదల చేయాలనే ప్రాథమిక అవగాహన కూడా లేకుండా ఈఈ నియంతలా వ్యవహరిస్తూ నాట్లు వేసుకోవద్దని సూచించడం సరికాదని హితవు పలికారు. ఇటీవల వర్షాలు ప్రారంభమైన వెంటనే ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్ రెడ్డి జిల్లా కలెక్టర్‌ను, మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డిని కలిసి కావలి కాలువకు నీరు విడుదల చేయాలని విజ్ఞప్తి చేయగా, 7వ తేదీనే సమావేశం నిర్వహించి కావలి కాలువకు మూడు టీఎంసీలు నీరు వదలేందుకు అంగీకరించిన విషయాన్ని గుర్తు చేశారు. ప్రస్తుతం కావలి కాలువ నుంచి ఎస్పీపీఎం కింద సుమారు 70 నుంచి 80 శాతం మంది రైతులు నాట్లు వేసుకోవడం పూర్తయిందన్నారు. పంట కాలాన్ని, నీటి వినియోగాన్ని పరిగణలోకి తీసుకుని రోజుకు 400 క్యూసెక్కుల వంతున 75 రోజుల పాటు నీరు వదిలినా 2.5 టీఎంసీలు సరిపోతాయని వివరించారు. సోమశిల జలాశానికి ఇన్‌ఫ్లో పెరిగే అవకాశం ఉండడంతో పాటు కావలి కాలువ కింద చెరువులన్నీ 70 శాతం మేర నీరుతో కళకళలాడుతున్నా పట్టించుకోకుండా నాట్లు వేసుకోవద్దని సూచించడం దారుణమన్నారు. రైతులను ఇబ్బంది పెడుతున్న ఈఈ స్థానంలో సాగునీటి సరఫరా వ్యవస్థపై అవగాహన ఉన్న సమర్థవంతమైన అధికారిని నియమించాలని విజ్ఞప్తి చేశారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలు సద్వినియోగం చేసుకోండి



మాట్లాడుతున్న మల్లికార్జునరెడ్డి

ఆత్మకూరురూరల్: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పలు సంక్షేమ పథకాలను అర్హులందరూ సద్వినియోగం చేసుకోవాలని బీజేపీ ఆత్మకూరు కన్వీనర్ కంది మల్లికార్జునరెడ్డి అన్నారు. మండలంలోని వాశిలిలో ఎంపీడీఓ ఐజాక్ ప్రవీణ్ అధ్యక్షతన శుక్రవారం వికసిత్ భారత్ సంకల్పయాత్ర జరిగింది. లబ్ధిదారులకు ఉజ్వల గ్యాస్ కనెక్షన్లు, అయుష్మాన్ భారత్ కార్డులు పంపిణీ చేశారు.

అభాగ్యులకు ఎన్‌ఆర్‌ఐ సాయం



ఆర్థిక సహాయం అందజేస్తున్న దృశ్యం

మర్రిపాడు: మండలంలోని కదిరినాయుడుపల్లికి చెందిన ఎన్‌ఆర్‌ఐ రామిరెడ్డి శ్రీనివాసులరెడ్డి పలువురికి శుక్రవారం ఆర్థిక సాయం అందజేశారు. పడమటినాయుడుపల్లికి చెందిన పక్షవాతంతో బాధపడుతున్న హుస్సేన్‌బాషాకు రూ.35 వేలు, అనారోగ్యంతో బాధపడుతున్న పోలంరెడ్డి చిన్నారెడ్డి, నారాయణమ్మ వృద్ధ దంపతులకు రూ.10 వేల వంతున ఆర్థిక సహాయం అందజేశారు.

అసాంఘిక కార్యకలాపాల అడ్డా

- పోలీస్‌స్టేషన్‌కు కూతవేటుదూరంలో స్టేడియం
- పగలు రాత్రి విచ్చలవిడి వ్యవహారాలు
- రాత్రి అయితే మందుబాబుల చిందులు



కావలి: పట్టణంలోని రెండో పట్టణ పోలీస్‌స్టేషన్ కూతవేటు దూరంలోనే క్రీడల శాఖ స్టేడియం ఉంది. క్రీడా మైదానం చుట్టూ చెట్లు గుబురుగా పెరిగాయి. క్రీడాకారులు, వాకర్స్ సేద తీరేందుకు వీలుగా సిమెంట్ బల్లలు ఏర్పాటు చేశారు. వీటిని అడ్డాగా చేసుకుని పగలు, రాత్రి విచ్చలవిడిగా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నారు. కావలిలోని ఉదయగిరి రోడ్డులో రాష్ట్ర క్రీడల శాఖకు చెందిన స్టేడియం నిర్మాణ ప్రతిపాదిత స్థలం 9.5 ఎకరాలు ఉంది. స్థలం చుట్టుపక్కల పలు విద్యా సంస్థలు న్నాయి. స్థానికంగా ఉదయం, సాయంత్రం వాకింగ్ చేసేవారు, క్రికెట్ ఆడుకునే యువకులు, విద్యార్థులు ఈ ఖాళీ స్థలానికి వస్తుంటారు. విద్యార్థులు, యువకులు జంటలుగా అక్కడ చేసి అనైతిక పనులకు పాల్పడుతున్నారు. చీకటి పడితే ఈ ప్రాంతంలో జంటలు విచ్చలవిడి పనులు శృతిమించుతున్నాయి. మందుబాబులు అయితే చిత్తుగా తాగి తైతక్కలాడటం సర్వసాధారణమైపోయింది. ఖాళీ మందు సీసాలు ఆ ప్రాంతంలో ఉంటుంది. వాకింగ్‌కు వచ్చిన వారు, ఆడుకోవడానికి వచ్చిన యువకులు ఖాళీ సీసాలు ఎబ్బెట్టుగా ఉన్నా యి. ఉదయం నుంచి చీకటి పడే వరకు ఈ ప్రాంతంలో నడిచే మధ్యస్థాలు, ప్రైవేట్ పంచాయతీలు కో కొల్లలు. చెంతనే పోలీస్‌స్టేషన్ ఉన్నా.. పోలీస్ సిబ్బంది మాత్రం అటు వైపు కన్నెత్తి చూడడం లేదు. ఉదయగిరి రోడ్డు మార్జిన్‌లో చిరు వ్యాపారాలు, చిరు దుకాణాలు వేళాపాళా లేకుండా మద్యం, ఇతర మత్తు పదార్థాలు సేవించేందుకు సహకరిస్తుండంతో పరిస్థితులు ప్రమాదకరంగా ఉంటున్నాయి. మత్తులో యువకులు రోడ్డుపై సైలెన్స్ లేని ద్విచక్ర వాహనాలతో విచ్చలవిడిగా భీకరమైన శబ్దాలు చూస్తూ రోడ్డులో వాహనాదారులను, పాదచారులను వణికిస్తున్నప్పటికీ పట్టించుకోవడం లేదు. విజువల్ పోలీసింగ్ అంటూ చెబుతున్న ఎస్పీ తిరుమలేశ్వరరెడ్డి ఇలాంటి అ సాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారిన స్టేడియం పరిసరాలపై పోలీస్ నిఘా ఉండేలా చర్యలు చేపట్టాలని స్థానికులు, క్రీడాకారులు, వాకర్స్ కోరుతున్నారు.

రేపు ప్రత్యేక ధ్యాన తరగతులు

ఆత్మకూరు: పట్టణంలోని శ్రీషిరిడీ సాయి పిరమిడ్ ధ్యాన కేంద్రంలో ఆదివారం ప్రత్యేక ధ్యాన తరగతులు నిర్వహిస్తున్నట్లు డాక్టర్ సుబ్రహ్మణ్యం శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. నాయుడుపేటకు చెందిన పిరమిడ్ ధ్యాన మాస్టర్ రాఘవేంద్రరావు ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు నిర్వహించే ఈ ధ్యాన కేంద్రంలో సంపూర్ణ ఆరోగ్యానికి, మనశ్శాంతితో పాటు అనేక అంశాలపై అవగాహన కల్పించనున్నట్లు వివరించారు. విద్యార్థులు, మహిళలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నేడు మండల సమావేశం

సీతారామపురం: మండల సర్వసభ్య సమావేశం శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఉదయం 11 గంటలకు జరుగుతుందని ఎంపీడీఓ రంగసుబ్బరాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ చింతంరెడ్డి పద్మావతి అధ్యక్షతన జరిగే ఈ సమావేశంలో విద్య, తాగునీరు, వ్యవసాయం, ఉపాధి హామీ, పంచాయతీరాజ్, గృహ నిర్మాణ శాఖలపై సమీక్ష నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మండలంలోని పంచాయతీ కార్యదర్శులు, సర్పంచ్‌లు, పలు శాఖల అధికారులు పాల్గొనాలని తెలిపారు.

జిల్లా డాక్టర్ల విభాగంలో ఉదయగిరికి చోటు

నెల్లూరు(దర్గామిట్ట): వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ఉదయగిరి నియోజకవర్గానికి చెందిన పలువురిని జిల్లా డాక్టర్ల విభాగం కమిటీలో వివిధ హోదాల్లో నియమించారు. జిల్లా డాక్టర్ల విభాగంలో జనరల్ సెక్రటరీగా షేక్ మస్తాన్, సెక్రటరీలుగా షేక్ అహ్మద్, యనమదాల శ్రీనివాసులు, జాయింట్ సెక్రటరీలుగా గువ్వల వెంకటరామయ్య, గోనిగుంట మధును నియమించారు.

ఆన్‌లైన్ ద్వారా పన్నులు చెల్లించాలి

ఉదయగిరి: గ్రామాల్లో ప్రజలు పంచాయతీలకు సంబంధించిన కుళాయి, ఇంటి, తదితర పన్నులను ఆన్‌లైన్ క్యూఆర్ కోడ్ ద్వారా మాత్రమే చెల్లించాలని ఈఓపీఆర్డీ మల్లికార్జున శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. నగదు ద్వారా చెల్లింపులు స్వీకరిస్తే కార్యదర్శులపై చర్యలు తీసుకుంటామన్నారు. కార్యదర్శులు గ్రామాల్లో పారిశుధ్యం మెరుగుకు చర్యలు తీసుకోవాలన్నారు.

ఆడుదాం ఆంధ్రా సమన్వయ సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ కరీముల్లా

చేజర్ల: ఆడుదాం ఆంధ్రా ఆటల పోటీలకు సంబంధించి శుక్రవారం ఎంపీడీఓ కార్యాలయంలో సమన్వయం సమావేశం జరిగింది. ఎంపీడీఓ ఎస్‌కే కరీముల్లా మాట్లాడుతూ ఆటల పోటీలకు కీడాకారుల రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తయిందన్నారు. క్రికెట్, కబడ్డీ, ఖోఖో, షటిల్, వాలీబాల్‌కు టీమ్స్ ఎంపిక చేపడుతున్నామన్నారు. ఈ మేరకు గ్రౌండ్స్‌ను సిద్ధం చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ–2 మస్తానయ్య, ఈఓపీఆర్డీ రామయ్య, పలు పాఠశాలల వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఓటు తొలగింపు దరఖాస్తులపై విచారణ



దరఖాస్తులు పరిశీలిస్తున్న తహసీల్దారు, సిబ్బంది

సంగం: మండలంలోని చెన్నవరప్పాడులో ఇటీవల ఒకే వ్యక్తి 70 ఓట్లకు పైగా తొలగించాలంటూ పెట్టిన దరఖాస్తులపై తహసీల్దారు నాగరాజు శుక్రవారం విచారణ చేపట్టారు. గ్రామంలో ఇరు పార్టీల నేతలు, బీఎల్‌ఓతో కలిసి ఆ ఓటర్లు గ్రామంలో ఉన్నారా లేదా విచారించారు. అన్ని ఆధారాలను పరిశీలించి చర్యలు తీసుకుంటామని తెలిపారు. అనంతరం గ్రామంలో ఉన్న ప్రాథమిక పాఠశాలను తనిఖీ చేశారు. తరగతి గదిలో బోధన తీరును విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులు క్రమ శిక్షణతో ఉండి చక్కగా చదువుకోవాలని సూచించారు.

రైతులకు వరి విత్తనాల పంపిణీ



రైతులకు వరి విత్తనాలను అందజేస్తున్న వ్యవసాయాధికారులు

సోమశిల: మిచాంగ్ తుఫాన్ కారణంగా వరి నారుమడులు దెబ్బతిన్న రైతుల కోసం రాష్ట్ర ప్రభుత్వం 80 శాతం సబ్సిడీతో వరి విత్తనాలను అందచేస్తోందని, రైతులు వీటిని సద్వినియోగం చేసుకోవాలని వ్యవసాయాధికారి శ్రీధర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని లింగంగుంట రైతుభరోసా కేంద్రం పరిధిలోని వెంగంపల్లి, ఇనగలూరు, బెడుసుపల్లి రైతులకు కేఎన్ఎం 1638 వరి విత్తనాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సుబ్బారెడ్డి, అగ్రికల్చర్ అసిస్టెంట్ వి.నాగేంద్ర, రైతులు ఉన్నారు.

ఎస్సై బాధ్యతల స్వీకరణ



బాధ్యతలు స్వీకరించిన ఎస్సై సూర్య ప్రకాష్‌రెడ్డి

సోమశిల: అనంతసాగరం పోలీస్‌స్టేషన్ నూతన ఎస్సైగా ఎం సూర్యప్రకాష్‌రెడ్డి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో కలిగిరి ఎస్సైగా విధులు నిర్వహిస్తున్న సూర్యప్రకాష్‌రెడ్డిని అనంతసాగరం ఎస్సైగా బదిలీ చేశారు. ఎస్సై మాట్లాడుతూ శాంతిభద్రతల విషయంలో ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు.

డీటీ జహీర్ బాధ్యతల స్వీకరణ



డీటీ జహీర్

సోమశిల: అనంతసాగరం మండల డిప్యూటీ తహసీల్దారుగా జహీర్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. జహీర్ గతంలో ఇక్కడే ఆర్ఐగా విధులు నిర్వహించి పదోన్నతిపై నెల్లూరుకు వెళ్లారు. పొదలకూరులో డీటీగా విధులు నిర్వహిస్తూ అనంతసాగరం మండలానికి బదిలీ అయ్యారు.

విచారించి చర్యలు తీసుకుంటాం



ఫారం–7 దరఖాస్తులపై విచారణ చేస్తున్న ఆర్డీఓ మధులత

చేజర్ల: మండలంలోని ఉలవపల్లిలో ఓట్ల తొలగింపు ఫారం–7 దరఖాస్తులపై పలు ఆరోపణలు వచ్చిన నేపథ్యంలో ఆత్మకూరు ఆర్డీఓ కే మధులత శుక్రవారం విచారణ చేపట్టారు. ఆమె ఉలవపల్లిలో విచారణ చేపట్టారు. ఫారం–7 కింద ఓట్లు తొలగించారని ఫిర్యాదు చేశారని, వాటిపై విచారించి చర్యలు తీసుకుంటామని ఆమె తెలిపారు. ఈ విచారణ పూర్తిస్థాయిలో చేపట్టనున్నట్లు తెలిపారు. ఆమె వెంట తహసీల్దార్ కృష్ణ, డీటీ విజయ్ ఉన్నారు.

పాస్టర్లకు దుస్తుల పంపిణీ



ఆత్మకూరు: క్రిస్మస్ పండగను పురస్కరించుకుని ఆత్మకూరు పట్టణానికి చెందిన ఎడ్నమ్మ మెమోరియల్ క్రిస్టియన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో గ్రామాల్లో పని చేసే పాస్టర్లకు శుక్రవారం వస్త్రాలను పంపిణీ చేశారు. ఆత్మకూరు, అనంతసాగరం, ఏఎస్‌పేట, మర్రిపాడు మండలాల గ్రామాల్లో చర్చిల్లో పనిచేస్తున్న పాస్టర్లకు బట్టలు అందజేసినట్లు సంస్థ నిర్వాహకులు ఎడ్వర్డ్ శిరీషా దంపతులు తెలిపారు.

ఇరవై ఏళ్లుగా పింఛన్ కోసం పోరాటం

కావలి నియోజకవర్గం



ఈమె పేరు పరిసిన ఈశ్వరమ్మ. 28 ఏళ్లు. కావలి పట్టణంలోని 39వ వార్డు పరిధిలోని మూర్తిశెట్టివారివీధిలో నివాసం ఉంటుంది. పుట్టుకతోనే దివ్యాంగురాలు. శరీరంలోని అవయవాలు పని చేయవు. కదల్లేదు. మాట్లాడలేదు. శారీరకంగా, మానసిక దివ్యాంగురాలు. తండ్రి చనిపోయాడు. ఈమెకు దివ్యాంగురాలి పింఛన్ కోసం తల్లి, అన్న ఇద్దరూ దశాబ్దాన్నర కాలం పోరాటం చేశారు. ఆ తర్వాత అన్నకు పెళ్లి కావడంతో వీరి పోరాటానికి వదిన కూడా తోడైంది. 20 సంవత్సరాలు పింఛన్ కోసం చేస్తున్న పోరాటం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఫలించింది. పింఛన్ మంజూరు చేయాలంటే రేషన్ కార్డు కావాలి. రేషన్ కార్డుకు ఆధార్ కార్డు కావాలి. ఈమెకు చేతి వేళ్ల సరిగా లేకపోవడంతో వేలిముద్రలు పడకపోవడంతో ప్రత్యామ్నాయంగా పాలకులు పింఛన్ మంజూరు చేయలేదు. తల్లి వృద్ధాప్యంతో మానసికంగా బలహీనంగా ఉండటంతో ఆమె పనులే ఆమె చేసుకోలేదు. వదినే ఆ యువతికి అన్ని సపర్యాలు చేస్తూ మానవత్వాన్ని చాటుకుంటుంది. దయనీయమైన పరిస్థితిలో ఉన్న యువతికి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం నెలకు రూ.3,000 పింఛన్ మంజూరు చేయడంతో ఆ యువతి కుటుంబం సంతోషం వ్యక్తం చేస్తోంది. – కావలి

జీవితంలో కళ తెచ్చిన 'జలకళ'

ఉదయగిరి నియోజకవర్గం





నా పేరు ఏలిక లాజర్. మాది కలిగిరి మండలం కృష్ణారెడ్డిపాళెం పంచాయతీ నడిమిమాదిగపాళెం. నాకు 4.93 ఎకరాలు ప్రభుత్వం ఇచ్చిన పొలం ఉంది. గతంలో ఆ పొలం నీటి వసతి లేక మెట్టపైర్లను నామమాత్రంగా సాగు చేసే వాళ్లం. జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం వచ్చాక వైఎస్సార్ జలకళ పథకం ద్వారా మా పొలంలో ఉచితంగా బోరు వేయడంతో పాటు మోటార్ ఏర్పాటు చేశారు. జూన్‌లో విద్యుత్ కనెక్షన్ కూడా ఉచితంగా ఇచ్చారు. ప్రస్తుతం ఆ పొలంలో 3 ఎకరాల్లో నిమ్మ చెట్లు, 1.50 ఎకరాలో వరి, 40 సెంట్లలో కూరగాయలు సాగు చేస్తున్నాం. నాకు ప్రతి నెలా డప్పు కళాకారుల పింఛన్ రూ. 3 వేలు అందుతోంది. ప్రతి ఏడాది రైతుభరోసా అందుతోంది. నా భార్య కృష్ణమ్మకు ఆసరా పథకం ద్వారా సంవత్సరానికి రూ. 18 వేలు అందుతున్నాయి. ప్రభుత్వ పథకాలు మా జీవితాల్లో వెలుగులు నింపాయి. జగనన్నకు మా కుటుంబం మొత్తం జీవితాంతం రుణపడి ఉంటాం. 2024లో జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిగా గెలిపించుకుంటాం. – కలిగిరి

అమ్మఒడితో చదువుకు ఢోకా లేదు

ఆత్మకూరు నియోజకవర్గం



నా పేరు సూరిపోగు అరుణ. చేజర్ల మండలం ఏటూరు గ్రామం. నేను, నా భర్త రమేష్ ఇద్దరం కూలి పనులు చేసుకుంటూ జీవిస్తున్నాం. మాకు ఇద్దరు పిల్లలు. పెద్దబ్బాయి కుమార్ చదువు కోసం ప్రైవేట్ పాఠశాలలో వేలాది రూపాయలు చెల్లించాల్సిన పరిస్థితి. మాకు అంత ఆర్థిక స్థోమత లేదు. ఇలాంటి పరిస్థితుల్లో ప్రభుత్వ పాఠశాలలో ఇంగ్లిష్ మీడియం చెబుతుండడం, అమ్మ ఒడి పథకం ద్వారా రూ.15 వేలు ఏటా వస్తుండడంతో మా కుమారుడి చదువుకు ఎలాంటి ఢోకాలేదు. మా ఇంటి సమీపంలోని కొందరు ఇంగ్లిష్ మీడియం చెప్పే ప్రైవేట్ పాఠశాలలకు వెళ్తుంటే మా బాబును పంపించలేకపోయానని దిగులుగా ఉండేది. జగనన్న ప్రభుత్వంలో ఆ దిగులు తీరిపోయింది. మా కుటుంబానికి పిల్లల చదువుల కోసం అమ్మ ఒడి పథకం రావడం అదృష్టంగా భావిస్తున్నాను. జగనన్నకు రుణపడి ఉంటాను. – ఆత్మకూరు/చేజర్ల

చిరస్మరణీయులు అమరజీవి



కావలి: పొట్టిశ్రీరాములు చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి



వరికుంటపాడు: నివాళులర్పిస్తున్న మేకపాటి



సంగం: తహసీల్దారు కార్యాలయంలో..



ఆత్మకూరు: రవాణాశాఖ కార్యాలయంలో..



సోమశిల: చిలకలమర్రి పాఠశాలలో..



సీతారామపురం: ఎంపీడీఓ కార్యాలయంలో..

కావలి: ఆంధ్ర రాష్ట్ర అవతరణ కోసం ప్రాణత్యాగం చేసిన అమరజీవి పొట్టిశ్రీరాములు చిరస్మరణీయులని కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్ రెడ్డి అన్నారు. పట్టణంలోని బాలకృష్ణారెడ్డినగర్‌లోని అమరజీవి వర్ధంతి సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అమరజీవికి పొట్టిశ్రీరాములు చిత్రపటానికి ఎమ్మెల్యే పూలమాలలతో ఘననివాళి అర్పించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ భాషాప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటి ప్రాతిపదికగా ఆంధ్రరాష్ట్రం కోసం ఆయన చేసిన పోరాటం స్ఫూర్తిదాయకమన్నారు.కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అమరజీవి పొట్టిశ్రీరాములు అభిమానులు, స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

వరికుంటపాడులో..

వరికుంటపాడు: మండలంలోని విరువూరు రైతుభరోసా కేంద్రంలో శుక్రవారం పొట్టి శ్రీరాములు వర్ధంతిని నిర్వహించారు. ఉదయగిరి నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త మేకపాటి రాజారెడ్డి అమరజీవి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ తెలుగు జాతి ప్రజల కోసం ప్రత్యేక రాష్ట్రం కావాలని ప్రాణత్యాగం చేసిన పోరాటపటిమ కలిగిన యోధుడు శ్రీరాములు అన్నారు. యువత ఇలాంటి వ్యక్తులను స్ఫూర్తిగా తీసుకొని నడచుకోవాలన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులు షేక్ అలీఅహ్మద్, ఎం.తిరుపతినాయుడు, ఎం.శ్రీనివాసులు పాల్గొన్నారు.

సంగంలో..

సంగం: సంగం తహసీల్దారు కార్యాలయంలో శుక్రవారం పొట్టి శ్రీరాములు వర్ధంతి తహసీల్దారు నాగరాజు ఆధ్వర్యంలో నిర్వహించారు. పొట్టి శ్రీరాములు చిత్రపటానికి సిబ్బందితో కలిసి పూలమాలలు వేసి నివాళులర్పించారు. డీటీలు అశోక్‌కుమార్, ప్రవీణ్‌కుమార్, వీఆర్‌ఓలు, సిబ్బంది పాల్గొన్నారు. సంగం తహసీల్దారు కార్యాలయ ఆవరణలో ఉన్న పొట్టి శ్రీరాములు విగ్రహం వద్ద ఆర్యవైశ్య సంఘం నాయకులు పొట్టి శ్రీరాములు వర్ధంతి వేడుకలను నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం నాయకులు రాజా, మల్లికార్జునరావు, గుప్తా, శ్రీరాం, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

అమరజీవికి ఘన నివాళి

ఆత్మకూరు: భాషా ప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటుకు ఆద్యుడు అమరజీవి పొట్టి శ్రీరాములు వర్ధంతిని శుక్రవారం పలు ప్రభుత్వ కార్యాలయాల్లో నిర్వహించారు. రవాణాశాఖ కార్యాలయంలో ఎంవీఐ పి రాములు పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాలల వేసి ఘన నివాళులర్పించారు. మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ బి నాగేశ్వరరావు చైర్‌పర్సన్ జి వెంకట రమణమ్మ నేతృత్వంలో అమరజీవి వర్ధంతిని నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆర్డీఓ, పోలీస్‌స్టేషన్, తదితర ప్రభుత్వ కార్యాలయాల్లో అమరజీవి వర్ధంతిని నిర్వహించారు. ఆయా కార్యాలయాల సిబ్బంది పాల్గొన్నారు.

సోమశిలలో

సోమశిల: పొట్టి శ్రీరాములు వర్ధంతి సందర్భంగా చిలకలమర్రి జెడ్పీ హైస్కూల్‌లో శుక్రవారం హెచ్ఎం సురేష్ ఆధ్వర్యంలో ఘనంగా నివాళులర్పించారు. ఉపాధ్యాయుడు చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రత్యేక ఆంధ్రరాష్ట్రం కోసం పొట్టి శ్రీరాములు ప్రాణత్యాగం చేశారన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రమణ, వెంకటేశ్వర్లు, రమణరాజు, మదీనా, కృష్ణారెడ్డి, మాధవి, శివకృష్ణ విద్యార్థులు పాల్గొన్నారు.

సీతారామపురంలో..

సీతారామపురం: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో అమరజీవి పొట్టి శ్రీరాములు వర్ధంతిని శుక్రవారం నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ రంగసుబ్బరాయుడు, ఈఓపీఆర్డీ భార్గవి, సీనియర్ అసిస్టెంట్ ఖలీల్, సిబ్బంది పాల్గొన్నారు.